క్లుప్తంగా

చేయూత



ములుగు రూరల్: మండలంలోని కాశిందేవిపేట గ్రామానికి చెందిన రాజ్యం రమేశ్ అనారోగ్యంతో ఇటీవల మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబాన్ని మాజీ సర్పంచ్ అహ్మద్‌పాషా గురువారం పరామర్శించి 50 కేజీల బియ్యం, రూ.2 వేల ఆర్థిక సాయం అందించారు. ఆయన వెంట ఎన్నిండ్ల ప్రదీప్, ప్రవీణ్, వీరస్వామి, తదితరులు ఉన్నారు.

డిపో ఏర్పాటు చేయాలి

ములుగు: జిల్లా కేంద్రంలో ఆర్టీసీ బస్ డిపోను ఏర్పాటు చేయాలని ప్రజా సంఘాల జేఏసీ జిల్లా అధ్యక్షుడు ముంజాల భిక్షపతిగౌడ్ ప్రభుత్వాన్ని కోరారు. ములుగు తరువాత డివిజన్‌లుగా ఏర్పడిన నర్సంపేట, జయశంకర్ భూపాలపల్లిలో బస్ డిపోలు ఉన్నాయని, గత పాలకుల నిర్లక్ష్యంతో ములుగు వెనుకబాటుకు గురయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ములుగులో డిపో ఏర్పాటుకు ప్రభుత్వం ప్రక్రియను వేగవంతం చేయాలని అన్నారు. అదే విధంగా ఇచ్చిన మాటకు కట్టుబడి ములుగు జిల్లాకు సమ్మక్క–సారలమ్మ జిల్లాగా నామకరణం చేయాలని కోరారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

కాళేశ్వరం: మహదేవపూర్ మండలానికి చెందిన ఓ వ్యక్తి పురుగుల మందు తాగి చికిత్స పొందుతున్న మృతి చెందాడు. ఎస్సై చక్రపాణి, స్థానికులు తెలిపిన కథనం ప్రకారం.. మండల పరిధిలోని ఎడుపల్లి గ్రామానికి చెందిన చేకుర్తి బానయ్య(46) మద్యానికి బానిసై ఈనెల 14న ఇంట్లో ఉన్న పురుగుల మందును తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు భూపాలపల్లిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. మృతుడి భార్య సారమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు. మృతుడికి కుమార్తె, కుమారుడు ఉన్నారు.

అల్లుడిపై కొడవలితో మామ దాడి



విజయ్‌కి వీపుపై ఏర్పడిన గాయం

మంగపేట: భార్యను తీసుకెళ్లేందుకు అత్తగారింటికి వచ్చిన అల్లుడిపై మామ కొడవలితో దాడి చేశాడు. ఈ ఘటన మండలంలోని రామచంద్రునిపేటలో గురువారం చోటు చేసుకుంది. బాధితుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మండలం పగిడేరు గ్రా మానికి చెందిన నాంపెల్లి విజయ్ అదే జిల్లా పినపాక మండలం బయ్యారంలో కోమలి అనే రెస్టారెంట్ నడుపుతూ ఓ పత్రిక రిపోర్టర్‌గా పనిచేస్తున్నాడు. నెల రోజుల క్రితం విజయ్‌తో భార్య గొడవపడి తన పుట్టినిల్లు అయిన మంగపేట మండలం రామచంద్రునిపేటకు వచ్చింది. ఈ క్రమంలో విజయ్ గురువారం భార్యను తీసుకెళ్లేందుకు తన తల్లితో కలిసి కారులో వచ్చారు. ఈ క్రమంలో మామఅల్లుడు వెంకన్న, విజయ్‌లు గొడవపడ్డారు. అల్లుడి విజయ్‌పై మామ వెంకన్న కొడవలితో దాడి చేసి తీవ్రంగాగా యపరిచాడు. తీవ్రంగా గాయపడిన విజయ్‌ను స్థా నికుల సహకారంతో అదే కారులో మణుగూరు ప్ర భుత్వ ఆస్పత్రికి తరలించారు. భార్యను తీసుకెళ్తున్న క్రమంలో తన కుమారుడిని తన ఎదుటనే ఇంటి లో పలికి పిలిచి వెంకన్న, అతని తమ్ముడు కలిసి కొడవలితో దాడి చేసి గాయపరిచారని బాధితుడి తల్లి ఆ రోపించింది. ఇద్దరం ఒకరినొకరు నెట్టుకున్నామని, ప్రమాదవశాత్తు కత్తిపీటపై పడడంతో విజయ్ కి గాయమైందని మామ వెంకన్న చెప్పాడు. ఒకరిపై ఒకరు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం.

ఏజెన్సీలో భూములను కాపాడాలి

మంగపేట: రాజ్యాంగం ద్వారా సంక్రమించిన ఐదవ షెడ్యూల్డు ఏరియా(ఏజెన్సీ)లోని భూములు అన్యాక్రాంతం, కబ్జాకు గురికాకుండా కాపాడాలని పెసా కమిటీ జిల్లా అధ్యక్షుడు డబ్బుల ముత్యాలరావు అన్నారు. మండల కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గిరిజన గిరిజనేతరుల మధ్య భూతగాదాలు, ఎల్టీఆర్ కేసులను పరిష్కరించేందుకు స్పెషలాఫీసర్, ములుగు ఏజెన్సీ ఏరియా సబ్‌కలెక్టర్‌గా ఐఏఎస్ క్యాడర్‌కు చెందిన వారిని నియమించాలన్నారు. గిరిజనేతర చేతిలో అన్యాక్రాంతం, ఆక్రమణకు గురైన భూములను కాపాడెందు, ఐటీడీఏలో పేరుకు పోయిన వేలాది ఎల్‌టీఆర్ కేసులను పరిష్కరించి గిరిజనులకు త్వరితగతిన న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. షెడ్యూల్డు ప్రాంతాల్లో 1/70, ఎల్‌టీఆర్ చట్టం నిబంధనలను అతిక్రమించి కొందరు ప్రభుత్వ అధికారులు ప్రైవేటు వ్యక్తులు ఇచ్చే ముడుపులకు కక్కుర్తిపడి వేల కోట్ల రూపాయల విలువైన భూములను గిరిజనేతరులకు ఎలా బదిలీ చేస్తున్నారని ఆయన ప్రశ్నించారు.

ఆల్బెండజోల్ మాత్రలు తప్పనిసరి

టేకుమట్ల: రక్తహీనత నుంచి రక్షణ పొందేందుకు 1 నుంచి 19 సంవత్సరాల వయస్సు గల పిల్లలందరూ ఆల్బెండజోల్ మాత్రలు తప్పనిసరిగా వేసుకోవాలని వెలిశాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఆశాజ్యోతి అన్నారు. గురువారం జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా మండలంలోని వెలిశాల, కస్తూరిబాగాంధీ బాలికా విద్యాలయంలో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేశారు. ఆనంతరం ఆమె మాట్లాడుతూ.. పిల్లల్లో నులి పురుగుల వృద్ధి వల్ల ఆకలి మందగించి రక్తహీనత ఏర్పడుతుందన్నారు. దాని వల్ల మెరుగైన శరీర అభివృద్ధి నిలిచిపోయి చురుకుదనం లోపిస్తుందన్నారు. ఆల్బెండజోల్ మాత్రలను పాఠశాలల్లో, అంగన్‌వాడీ కేంద్రాల్లో, సబ్‌సెంటర్‌లు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రెడ్డి మల్లారెడ్డి, జెడ్పీటీసీ పులి తిరుపతిరెడ్డి, మాజీ సర్పంచ్‌లు గునిగంటి మహేందర్, చింతలపెల్లి స్వామిరావు, డాక్టర్ మధురిమ, హెచ్ఈఓ జమాలుద్దీన్, హెల్త్ అసిస్టెంట్ కృష్ణారెడ్డి, సతీష్, ఏఎన్ఎం సంగీత, రాజ్యలక్ష్మి, సునీత, ఆశ వర్కర్ కోమల, తదితరులు పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణతో ఆరోగ్యం

రేగొండ: నులిపురుగులను నివారిస్తేనే చిన్నారుల ఆరోగ్యం మెరుగ్గా ఉంటుందని ఎంపీపీ పున్నం లక్ష్మీ అన్నారు. గురువారం మండలంలోని ఎంజేపీ, కస్తూరిబా, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలో మండల వైద్యాధికారి హిమబిందు ఆధ్వర్యంలో చిన్నారులకు నులిపురుగుల నివారణ మాత్రలు వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. చిన్నారులలో ఎనీమియా నిర్మూలించడానికి ఆల్బెండజోల్ మాత్రలు తప్పనిసరిగా వేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ, ప్రైవేట్ ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్స్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



టేకుమట్ల: ఆల్బెండజోల్ మాత్రలు వేస్తున్న డాక్టర్ ఆశాజ్యోతి



రేగొండ: పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు వేస్తున్న ఎంపీపీ పున్నం లక్ష్మీ

ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ

మహాముత్తారం: జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా మండలంలోని మోడల్ పాఠశాల విద్యార్థులకు గురువారం మండల వైద్యాధికారి సందీప్ ఆధ్వర్యంలో ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మోడల్ పాఠశాల ప్రిన్సిపాల్ రాజు, ఎంఎల్‌హెచ్‌పీ వైద్యాధికారి మమత, సీహెచ్ఓ విద్యాసాగర్, బండి శ్రీనివాస్, ఆశవర్కర్లు, వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మల్హర్: నులి పురుగుల నివారణకు పూర్తి స్థాయిలో చర్యలు తీసుకోవాలని ఎంపీపీ చింతలపల్లి మల్హల్ రావు అన్నారు. జాతీయ నులి పురుగుల దినోత్సవం సందర్భంగా మండల కేంద్రం తాడిచర్లతో పాటు ఆయా గ్రామాల్లోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో గురువారం ఒకటి నుంచి 19 సంవత్సరాలు దాటిన పిల్లలకు ఎంపీపీ, వైద్య సిబ్బంది ఆల్బెండజోల్ మాత్రలను అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ శ్యామ్‌సుందర్, వైద్యాధికారి రాజు, వ్యవసాయ అధికారి సుధాకర్, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

మొగుళ్లపల్లి: ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల వైద్యాధికారిణి నాగరాణి ఆధ్వర్యంలో జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జెడ్పీటీసీ జోరుక సదయ్య, తహసీల్దార్ సునీత, ఎంపీడీఓ హుస్సేన్ హాజరయ్యారు. మండలంలోని అన్ని గ్రామాల్లోని పాఠశాలల్లో, అంగన్‌వాడీ సెంటర్లలో ఆల్బెండజోల్ మాత్రలు వేయడం వేశారు. ఈ సందర్భంగా డాక్టర్ నాగరాణి మాట్లాడుతూ.. మండలంలో 1 నుంచి 19 సంవత్సరంలో ఉన్న పిల్లలు 5470 మంది పిల్లలు ఉన్నారని వారం దరికీ కూడా అల్బెండజోల్ మాత్రలు వేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విజయపాల్ రెడ్డి, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ఆర్ వెంకటస్వామి, హెల్త్ సూపర్‌వైజర్ సునీత, హెల్త్ అసిస్టెంట్ భిక్షపతి, ఏఎన్ఎం శ్రీలత, గ్రామపంచాయతీ సెక్రెటరీ నరేష్ ,ఆశా కార్యకర్తలు, ఉపాధ్యాయులు, పాఠశాల విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.



మహాముత్తారంలో..



తాడిచర్ల జిల్లా పరిషత్ పాఠశాలలో..



మొగుళ్లపల్లిలో..

కలెక్టర్‌ను కలిసిన ఎంపీపీ మల్లారెడ్డి



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎంపీపీ

టేకుమట్ల: ఇటీవల కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన రాహుల్‌శర్మను ఎంపీపీ రెడ్డి మల్లారెడ్డి జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట బీఆర్ఎస్ రాఘవాపూర్ కో ఆప్షన్ సభ్యులు ఓదెలు ఉన్నారు.

పెయింటింగ్ యూనియన్ ఎన్నిక



ఎన్నికైన కమిటీ సభ్యులు

గోవిందరావుపేట: మండల కేంద్రంలోని వ్యవసాయ గిడ్డంగుల వద్ద గురువారం నిర్వహించిన పెయింటింగ్ వర్కర్ల సమావేశంలో మండలంలోని అన్ని గ్రామాల పెయింటింగ్ వర్కర్లు కలిసి మండల కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా గజ్జెల రంజిత్, ఉపాధ్యక్షుడిగా గురుకు మహేష్, ప్రధాన కార్యదర్శిగా ఎల్లావుల రాకేశ్, ముఖ్య సలహాదారులుగా బొడ్డు మహేష్, గజ్జెల రాకేష్, మునిగాల కిషోర్‌లను ఎన్నుకున్నారు.

పత్తి విత్తనాల దందాను అరికట్టాలి

చిట్యాల: చిట్యాల, మొగుళ్లపల్లి, టేకుమట్ల మండలాల్లో పత్తి విత్తనాల దందా జోరుగా సాగుతుందని అధికారులు స్పందించి అరికట్టాలని సీపీఐ ఎంఎల్ జిల్లా కార్యదర్శి మారపెల్లి మల్లేష్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. ఆరుగాలం కష్టపడి పంటలు పండించే రైతులను ఫర్టిలైజర్ షాపు యాజమానులు మోసం చేస్తున్నారని ఆరోపించారు. అమయక రైతులకు కొత్త విత్తనాలు వచ్చాయని అధిక రేట్లకు అమ్ముతూ రైతుల వద్ద నుంచి ఎక్కువగా డబ్బులు వసులు చేస్తున్నారని ఆరోపించారు. ఇంత జరుగుతున్న మండల వ్యవసాయ అధికారులు ఏమి తెలియనట్లు నిర్లక్ష్యం చేస్తున్నారని అన్నారు. మండలాల్లోని ఆయా షాపుల్లో యూఎస్ కంపెనీ 7067 పత్తి గింజలను అధిక రేట్లకు అమ్మతున్నారని వాపోయారు. ఒక ప్యాకెట్‌పై రూ.864 ధర ఉంటే వాటిని సుమారు రూ.పదిహేను వందల నుంచి రూ.రెండు వేలకు అమ్ముతున్నారని తెలిపారు. ఇంత జరుగతున్న అధికారులు నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరించడం ఎంటనీ ప్రశ్నించారు. ఒక పక్క రైతులను మోసం చేస్తే కఠిన చర్యలు తప్పవని ప్రభుత్వం హెచ్చరిస్తున్నా షాపు యాజమానులు ఏమాత్రం భయం లేకుండా అధిక రేట్లకు అమ్ముతున్నారని అన్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి రైతులను కాపాడాలని కోరారు. అలాగే మండల అధికారులు నిర్లక్ష్యం మూలంగానే ఈ తతంగం అంత జరుగుతుందని వారిపై చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.



మాట్లాడుతున్న మారపెల్లి మల్లేష్

పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలి

ములుగు రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ మమన్‌యాదవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం జిల్లా కేంద్రంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో జిల్లాకో ఇంటర్‌నేషన్ స్కూల్ ఏర్పాటు చేస్తామని అన్నారని గుర్తు చేశారు. ప్రైవేటు పాఠశాలల్లో ఫీజు నియంత్రణ లేక విద్యార్థుల తల్లితండ్రులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని అన్నారు. ఫీజు నియంత్రణ చట్టాన్ని వెంటనే అమలు చేయాలని అన్నారు. పాఠశాలల్లో యూనిఫాం, పాఠ్య పుస్తకాల అమ్మకాలు చేపడుతూ దోపిడీకి పాల్పడుతున్న విద్యాశాఖ అధికారులు పట్టించుకోవడం లేదని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు కొరత లేకుండా చూడాలని అన్నారు. విద్యాహక్కు చట్టాన్ని అమలు చేసి ప్రైవేటు పాఠశాలల్లో 25శాతం పేద విద్యార్థులకు ఫీజు రాయితీ కల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాయకులు

నాయకులగూడెంలో మదర్స్ క్లినిక్

వెంకటాపురం(కె): మండల పరిధిలోని నాయకులగూడెం గ్రామంలో మదర్స్ క్లినిక్ కార్యక్రమాన్ని ఎదిర వైద్యాధికారి భవ్యశ్రీ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది గ్రామంలోని బాలింతల ఇంటికి వెళ్లి వారికి ఆరోగ్య పరీక్షలను నిర్వహించారు. బాలింతలు ఐరన్ అధికంగా ఉంటే ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. అనంతరం అంగన్‌వాడీ సెంటర్‌లోని చిన్నారులకు నులిపురుగుల నివారణ మాత్రలు వాడకంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు.



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి భవ్యశ్రీ

పంచాయతీరాజ్ చట్టంపై అవగాహన



అవగాహన సదస్సులో పాల్గొన్న గ్రామస్తులు

వెంకటాపరం(కె): మండల పరిధిలోని ముత్తారం గ్రామంలో కాఫెడ్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో స్థానిక స్వపరిపాలన, పంచాయతీ రాజ్ చట్టంపై గ్రామస్తులకు గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ముత్తారం పాఠశాల ఉపాధ్యాయుడు కారం రాంబాబు గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సేవ సంస్థ సభ్యులు గొంది హనుమంతు, కామేష్, ఉషారాణి, ఇందిర, నరేష్, పద్మ, ప్రశాంత్ తదితరులు ఉన్నారు.

రూ.లక్షల్లో కొల్లగొడుతున్నారు..

- కోరలు చాస్తున్న సైబర్ భూతం
- నానాటికీ పెరుగుతున్న బాధితుల సంఖ్య

రేగొండ: మండలంలో సైబర్ మోసాల బారిన పడుతున్న వారి సంఖ్య నానాటికీ పెరుగుతుంది. అవగాహన ఉన్నవారు పోలీసులను నేరుగా ఆన్‌లైన్‌లో ఆశ్రయిస్తున్నారు. మిగతా వారు తక్కువ మొత్తం నష్టపోవడంతో ఏం చేయాలో తెలియక, ఫిర్యాదు చేసిన డబ్బు వస్తుందన్న నమ్మకం లేక వదిలేస్తున్నారు. ఇలాంటి వారినే ఆసరాగా చేసుకుని సైబర్ నేరగాళ్లు పేట్రేగిపోతున్నారు. రోజురోజుకూ పెరుగుతున్న సాంకేతిక పరిజ్ఞానంతో నేరగాళ్లు వినూత్న పద్ధతుల్లో మోసాలకు పాల్పడుతున్నారు. కాస్త ఏమరుపాటుగా ఉన్నా సరే డబ్బు నష్టపోవడం బాధితుల వంతవుతుంది.

డ్రాలు, బహుమతులు, రుణాల పేరిట..

ప్రముఖ కంపెనీల పేరు చెబుతూ లక్కీడ్రా బహుమతికి ఎంపికయ్యారంటూ ఇటీవల చాలా మందికి ఫోన్లు వస్తున్నాయి. అంతేగాక ఎలాంటి పత్రాలు సమర్పించకుండానే రుణం ఇస్తామని మెసేజీలు పంపిస్తున్నారు. ఇలాంటి ఫోన్లకు స్పందించిన, మేసెజ్‌లో వచ్చే లింక్ తెరిచినా నష్టపోయే అవకాశం ఉంది. ఆపై మోసగాళ్లు ఫోన్ చేసి బ్యాంకులు, కంపెనీల అధికారుల మాదిరి మాట్లాడి బ్యాంక్ ఖాతాలు, పిన్ నంబర్లు, ఐఎఫ్ఎస్‌సీ తెలుసుకుని డబ్బు లాగేస్తున్నారు. మరి కొందరు నేరగాళ్లు ఓటీపీ తెలుసుకుని డబ్బు లాగేస్తున్నారు. ఇది జరిగినా వెంటనే గుర్తించి పోలీసులను ఆశ్రయిస్తే కొంత మేర ఫలితం ఉంటుంది. మిగతా వారు ఖాతా వివరాలు కొన్నాళ్లకు చూసుకుంటే కనక అప్పటికే డబ్బు డ్రా చేసి ఉండడంతో చేసేదేం లేక వదిలేయాల్సి వస్తుందని చెబుతున్నారు.

- టేకుమట్ల మండలంలోని అంకుషాపూర్ సీఏతో పాటు రాఘవపూర్ సీఏ ఇటీవల సైబర్ క్రైం ఉచ్చులో చిక్కుకున్నారు. మండల కేంద్రంలోని ఏపీజీవీబీలో మిత్రలుగా పని చేస్తున్న రాఘవాపూర్, అంకుషాపూర్ సీఏలకు సైబర్ క్రైం దుండగులు బ్యాంక్ నుంచి కాల్ చేస్తున్నామని అంకుషాపూర్ సీఏ నుంచి రూ.2లక్షల 4 వేలు, రాఘవాపూర్ సీఏ నుంచి రూ.22 వేలు ఏక కాలంలో తస్కరించారు.
- కొత్తపల్లిగోరి మండల కేంద్రంలోని ఏపీజీవీ బ్యాంక్‌లో సీఏ గా పని చేస్తున్న సదరు మహిళకు వాట్సాప్ గ్రూప్‌లో లింక్ రావడంతో ఓపెన్ చేసింది. దీంతో ఆమె ఫోన్ హ్యాక్ చేసి సైబర్ నేరగాళ్లు విడతల వారిగా రూ.25 వేలు తీశారు. సదరు మహిళకు తెలియకుండానే తన నంబర్ నుంచి కూడా మిగతా వాట్సాప్ గ్రూప్‌లకు లింక్‌ను దుండగులు పంపించడం గమనార్హం.

అవగాహన కల్పిస్తున్నాం..



ప్రజలు సైబర్ నేరాల బారిన పడకుండా అవగాహన కల్పిస్తున్నాం. బ్యాంకు అధికారులు ఎట్టి పరిస్థితుల్లో ఫోన్ ద్వారా వివరాలు అడగరని, గుర్తు తెలియని వ్యక్తులకు బ్యాంక్ అకౌంట్, ఓటీపీ, ఇతర వివరాలు ఆరా తీస్తే చెప్పొద్దని సూచిస్తున్నాం. ఒకవేళ మోసానికి గురైనట్లు భావిస్తే పోలీస్ స్టేషన్‌లో కాని, సైబర్ సెల్ టోల్ ఫ్రీ నంబర్ 1930కు వెంటనే ఫిర్యాదు చేయాలి.

– ఎస్.రవికుమార్, ఎస్సై, రేగొండ

పోగొట్టుకున్న ఫోన్ల అప్పగింత



సెల్‌ఫోన్లు అప్పగిస్తున్న పోలీసులు

ఏటూరునాగారం: ఇద్దరు యువకులు మండల కేంద్రంలో రెండు మొబైల్స్ పోగొట్టుకోగా సీఐ అనుముల శ్రీనివాస్, ఎస్సై తాజొద్దీన్ మొబైల్‌లను వారికి గురువారం అప్పగించారు. మండ కేంద్రానికి చెందిన రాము డిగ్రీ కాలేజ్ వద్ద, అలాగే కన్నాయిగూడెం మండలం కంతనపల్లి గ్రామానికి చెందిన నాగేష్ స్రవంతి నర్సింగ్ హోమ్ ఆస్పత్రి వద్ద ఫోన్లను పోగొట్టుకున్నారు. ఈ మేరకు వారు ఈ నెల 16న పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేయగా సీఐ, ఎస్సై మొబైల్‌లను రికవరీ చేసి బాధితులకు అప్పగించారు. ఎవరైనా మొబైల్ పోగొట్టుకున్న తస్కరించబడిన ఈఎంఐ నంబర్‌తో సహా ఫిర్యాదు చేయాలని ట్రేస్ చేసి పట్టుకుంటామన్నారు.

‘మంత్రిపై ఆరోపణలు అర్థరహితం’

మహాముత్తారం: రాష్ట్ర ఐటీ పరిశ్రమలశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుపై పెద్దపల్లి జెడ్పీచైర్మన్ పుట్ట మధు చేసిన అవినీతి ఆరోపణలు అర్థరహితమని కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు అన్నారు. గురువారం మండలంలోని యామన్‌పల్లి ప్రధాన కూడలి వద్ద వారు మాట్లాడారు. రాష్ట్ర ఐటీ పరిశ్రమలశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు చేస్తున్న అభివృద్ధి పథకాల అమలును చూసి జీర్ణించుకోలేక జెడ్పీ చైర్మన్ పుట్ట మధు, బీఆర్ఎస్ నాయకులు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడు పోలీస్‌లను వాడుకొని మంథని నియోజకవర్గంలో అనేక అక్రమాలకు పాల్పడ్డ చరిత్ర పుట్ట మధుదేనని ఆరోపించారు. మండల కోఆప్షన్ సభ్యుడు నజీర్‌ఖాన్, నాయకులు అట్టెం రమేష్‌ముదిరాజ్, హిమాకర్, రామోజీ, జమ్మయ్య, శేకర్ ,రాకేష్‌నాయక్, గోగికారి శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న నాయకులు

అసాంఘిక శక్తులపై అప్రమత్తంగా ఉండాలి

వెంకటాపురం(కె): అసాంఘిక శక్తులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై తిరుపతిరావు అన్నారు. గురువారం మండల పరిధిలోని తిప్పాపురం పంచాయతీ కలిపాక గ్రామంలో కమ్యూనిటీ కాంటాక్టు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామస్తులతో సమావేశం నిర్వహించి గ్రామంలోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వర్షాకాలంలో వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహించే అవకాశం ఉన్నందున గ్రామస్తులు ఈతకు, చేపలను పట్టెందుకు వెళ్లొద్దని సూచించారు. గ్రామంలోకి ఎవరైనా అనుమానిత వ్యక్తులు, అపరిచిత వ్యక్తులు కనిపిస్తే తక్షణమే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. సమాచారం ఇచ్చిన వ్యక్తుల వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు.



మాట్లాడుతున్న ఎస్సై తిరుపతిరావు

ఆదివాసీలకు న్యాయం చేయాలి

వెంకటాపురం(కె): కొమరంభీమ్ ఆదివాసీలకు న్యాయం చేయాలని గొండ్వానా సంక్షేమ పరిషత్ జిల్లా అధ్యక్షుడు పూనెం ప్రతాప్ అన్నారు. ఆదివాసీల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ తహసీల్దార్ కార్యాలయం ఎదుట గొండ్వానా సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో ఆదివాసీలు చేస్తున్న రిలే నిరాహార దీక్ష గురువారానికి పదకొండవ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా వారు వంటా వార్పు కార్యక్రమం నిర్వహించి నిరసనను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఒంటిమామిడి గ్రామస్తులు తదితరులు ఉన్నారు.



నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
జయశంకర్ భూపాలపల్లి : 9951602872
Office mail : wglsakshiadvt@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
ఎ. మహేష్ (S.R) : 9505555291
కె. సుధాకర్ (ACO) : 9177258410